క్లుప్తంగా

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు నీతి కథలను వివరిస్తున్న గ్రంథాలయాధికారి చంద్రకళ

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలోని నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. దీనిలో భాగంగా విద్యార్థులకు బుధవారం తెలుగు డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. అంతకుముందు రిసోర్సు పర్సన్ సత్య ఆధ్వర్యంలో తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ విద్యార్థులకు నీతి కథలను బోధించి అర్థాలను వివరించారు. విద్యార్థులతో నీతి కథలను చదివించారు.

సింహాచలం ఘటనపై విచారణ జరిపించాలి

గాజువాక: సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనపై విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. ఈ సంఘటనకు సింహాచలం దేవస్థానం, రెవెన్యూ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి టోల్ మధ్యలో డివైడర్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో గాజువాక పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు 50 నుంచి 55 మధ్యలో ఉంటుందని, గుర్తు పట్టడానికి ఆనవాళ్లు ఏమీ లేవని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 9642364770 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మేడే వేడుకల్లో పాల్గొన్న వామనమూర్తి తదితరులు

అల్లిపురం: డ్రైవర్లకు భారీగా జరిమానాలు విధించే 21,31 జీవోను రద్దు చేసి, డ్రైవర్లందరికీ పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. 139వ మే డే సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుడు కె. చంటి మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 1886 మే 1న అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికవర్గం 8 గంటల పని విధానం అమలు చేయాలని పోరాడి అమరులైన అమర జీవులకు జోహార్లు అర్పించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కులను హరిస్తే ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరించారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు, మోటార్ వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మేడేని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం జిల్లా నాయకులు వై. వెంకటి, నాయకులు కె. అప్పలరాజు, ఎల్. పరశురాం, పిల్లా శంకర్, ఎస్. అనిల్, వి.సంతోష్, కె. రాము పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

సీతమ్మధార: కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించినట్లు ఏసీడీపీవో శ్రీలత తెలిపారు. విశాఖ అర్బన్ పరిధి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ కుమారి, బి.మమత, బి.శకుంతల పాల్గొన్నారు.

రిమ్ జిమ్.. రిమ్ జిమ్

ప్రజలకు ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెరిగింది. ఉరుకుల పరుగుల జీవితంలో మూడు పదులు నిండకుండానే అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో ఆరోగ్యంపై దృష్టిసారిస్తున్నారు. మరికొందరు మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం చేస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా జిమ్‌ల బాట పడుతున్నారు. దీంతో పలు జిమ్‌లలో ప్రత్యేక శిక్షకులను సైతం నియమించి కసరత్తులు చేసే వారికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు.



ప్రత్యేక పరికరాల ద్వారా శిక్షణ

ఫిట్‌నెస్‌పై పెరిగిన శ్రద్ధ

జిమ్‌ల బాటపడుతున్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: జిమ్‌లకు క్రేజ్ పెరిగింది. ఓపెన్ జిమ్‌లకు కొంత మంది వెళుతుంటే మరికొంత మంది అన్ని వసతులు ఉన్న జిమ్ కమ్ ఫిట్‌నెస్ సెంటర్ల బాట పడుతున్నారు. జిమ్‌లకు వెళ్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, శీలానగర్‌లలో పదుల సంఖ్యలో జిమ్‌లు వెలిశాయి. దీనికి తోడు మహిళలు పలు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో వారు జిమ్‌లను ఆశ్రయిస్తున్నారు.

సజావుగా సాగేలా..

వ్యాయామ ప్రియులు మైదానాలను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వాకింగ్, జాగింగ్‌లకు మాత్రమే అవకాశం ఉంటుంది. వర్షాకాలం వస్తే మైదానంలో వ్యాయామం చేయడానికి ఇబ్బందులు ఏర్పడతాయి. దీంతో ఎక్కువ మంది జిమ్‌ల బాట పడుతున్నారు.

శిక్షకులతో అవగాహన

జిమ్‌లలో ప్రత్యేక శిక్షకులను నియమించారు. వయస్సు ఆధారంగా ఏయే ఉపకరణాలు ఉపయోగించాలో ట్రైనర్లు సూచిస్తారు. పోలీస్, నేవీ, ఎయిర్ ఫోర్స్, మిలట్రీ వంటి ఉద్యోగాలకు పోటీ పడేవారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఇక 60 సంవత్సరాలు దాటిన వారిలో షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న వారికి సైక్లింగ్, స్లో రన్నింగ్‌తో పాటు వారితో పలు వ్యాయామ శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు పలువురికి కొలస్ట్రాల్ తగ్గడానికి, బరువు నియంత్రణకు తీసుకోవాల్సిన న్యూట్రీషన్ ఫుడ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. రెండు రకాలుగా శిక్షణ ఇస్తారు.



జిమ్‌లో డంబెల్‌తో యువకుడు

జిమ్‌ల ఏర్పాటుతో ఉపాధి

ఆరోగ్య స్పృహ పెరగడంతో జిమ్‌లకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. దీంతో చాలా మంది యువత జిమ్‌ల ఏర్పాటుకు మొగ్గుచూపుతున్నారు. ఉపాధి పొందుతున్నారు.



జిమ్‌లో కసరత్తు చేస్తున్న మహిళ



డంబెల్స్

ప్రత్యేక దృష్టి పెడతాం



జిమ్‌కు వచ్చే వారిలో చాల మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉంటున్నారు. మహిళల సమస్యలు ఎక్కువగా ఉంటాయి. వీరిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి అనుగుణంగా సూచనలు, సలహాలు ఇస్తాం. వారు నిత్యం తీసుకునే ఆహారం, న్యూట్రీషన్ ఫుడ్ విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

– బర్ల రవికుమార్ యాదవ్, ఆర్‌కే జిమ్ ఫిట్‌నెస్ సెంటర్ యజమాని

ప్రణాళిక ప్రకారం కసరత్తు



జిమ్‌కు వచ్చే మహిళల్లో అనేక సమస్యలు ఉంటాయి. వారు శిక్షణ తీసుకుంటున్న సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. జిమ్ చేస్తున్న సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక ప్రకారం కసరత్తులు చేయిస్తాం.

– ఎ.హేమాంకిత, మహిళా ట్రైనర్

ఆరోగ్యం చాలా బాగుంది



జిమ్‌లో చేరాక ఆరోగ్యం చాలా బాగుంది. నిత్యం ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇస్తారు. నా శారీర శ్రమ ప్రకారం శిక్షకులు సూచించే పరికరంతో సాధన చేస్తాను. ఆరోగ్యం సమస్యల ప్రకారం జిమ్‌లో శిక్షణ ఇవ్వడం సరైన విధానం.

– ఎ.శ్రీకాంత్, సాధకుడు

మహిళలకు ప్రత్యేక పరికరాలు



మహిళలు వ్యాయామం చేయడానికి వీలుగా జిమ్‌లలో పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇస్తూ వారికి ఉపకరణాలు కేటాయిస్తున్నారు. వయస్సు, శారీరక పరిస్థితి ప్రకారం సూచనలు, సలహాలు ఇస్తున్నారు. తీసుకోవాల్సిన ఆహారం.. న్యూట్రీషన్ ఫుడ్‌పై అవగాహన కల్పిస్తుంటారు.

– టి.చంద్రిక, సాధన చేస్తున్న మహిళ

స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు నగేష్‌కు ఘన వీడ్కోలు



నగేష్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్, బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ పి.వి. నగేష్‌కు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నగేష్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా బుధవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగం అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు నగేష్, కల్యాణి దంపతులను సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ విభాగం అభివృద్ధికి నగేష్ఎనలేని సేవలు అందించారన్నారు. మరోవైపు కార్మిక నాయకుడిగా విభాగ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. ఆయన భవిష్యత్తు జీవితం ఆనందదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, పోతయ్యరెడ్డి, పాల అప్పలరెడ్డి కన్వీనర్, పోలీసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేసును నీరుగార్చడానికే విచారణ కమిటీ

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

అగనంపూడి: సింహాచలం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కమిటీలతో కాలయాపన చేయకుండా తక్షణమే బాధ్యులను కఠినంగా శిక్షించాలని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు డిమాండ్ చేశారు. అగనంపూడిలో ఆయన మాట్లాడుతూ పక్షం రోజులుగా మంత్రుల కమిటీలు, కూటమి పాలకులు నానా హడావుడి చేశారన్నారు. చిన్నపాటి గాలివానకు నిర్మాణం కూలిపోయిందంటే అవినీతి, నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుందన్నారు. ప్రస్తుత కమిటీని రద్దు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ కమిటీ పేరుతో ప్రభుత్వం సంఘటనను నీరు గార్చేందుకు కుట్ర పన్నుతుందని ఆయన ఆరోపించారు. తక్షణమే మృతుల కుటుంబాలు, క్షతగాత్రులను ఆదుకోడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు.

డీపాల్ విద్యార్థుల ప్రతిభ



ఉడిప్తి



ఉదయ్ కార్తీక్

ఉక్కునగరం: ఐసీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో స్టీల్‌ప్లాంట్ డీపాల్ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐసీఎస్ఈ బోర్డు నిర్వహించిన పరీక్షలకు 191 మంది హాజరయ్యారు. పి. ఉడిప్తి 98.4 శాతంతో మొదటి స్థానం, ఎం. ఉదయకార్తీక్ 98 శాతంతో రెండో స్థానం, అల్సన్ జోసఫ్, శ్రీహితారెడ్డి, తాత్యా కౌశల్ 97.2 శాతంతో మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అనీష్ మాథ్యూ, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ షాజి, డీన్ ఆఫ్ స్టడీస్ ఫాదర్ ప్రవీష్ అభినందించారు.

'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం, సాహితీవేత్తలు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శత వసంతాల రచయిత్రి రాజమ్ కృష్ణన్ రచించిన 'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. బసు పోతన ఆహ్వానం పలకగా.. సభాధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు స్వాగతోపన్యాసం చేశారు. సాహితీవేత్త, నాటక కర్త పొలిమెరశెట్టి ఫ్రాన్సిస్ శ్రీశ్రీ జయభేరి కవితను వినిపించారు. అరసం 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్.హనుమంతరావు అరసం చరిత్రను వివరించారు. ముఖ్య అతిథి యూపీఎస్సీ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్. చలం పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితకు అభినందనలు తెలిపారు. పుస్తకంలోని మహిళల ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడారు. విమర్శకుడు ఆచార్య చందు సుబ్బారావు కవితా శైలిని విశ్లేషించారు. ఏయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేసి మాట్లాడుతూ దివంగత రాజమ్ కృష్ణన్ అనుభవాలు, అభిప్రాయాలతోపాటు గొప్ప అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. మరో సమీక్షకురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ మాట్లాడుతూ రాజమ్ కృష్ణన్ రష్యాలో విహరించి, తన ఆలోచనలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. ప్రచురణ కర్త మానవ హక్కుల వేదిక కార్యకర్త పోలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి గురించి వివరించారు. సోషలిస్ట్ సమాజంలో మహిళా ఎలా ఉండాలో ఈ పుస్తకం చెబుతుందన్నారు.

జనరల్ బోగీల ప్రయాణికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



రైల్వే ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: ఎండలకు అల్లాడుతున్న రైల్వే ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీకి స్థానిక ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంఘాలు శ్రీకారం చుట్టాయి. దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై సుదూర ప్రాంతం నుంచి వచ్చే రైళ్లలోని జనరల్, దివ్యాంగులు, మహిళా బోగీల్లోని ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. డీఆర్ఎం అనుమతితో రెండు మాసాల పాటు మధ్యాహ్నం దువ్వాడ వచ్చే రైళ్లలోని జనరల్ బోగీల ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు అందించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో షాలిమార్ వాస్కోడిగామా రైలులోని ప్రయాణికులకు వీటిని అందించారు. కార్యక్రమంలో దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ,రైల్వే అధికారులు ఎం.ఎస్.రావు, చంద్రశేఖర్‌ల పర్యవేక్షణలో తూర్పు కోస్తా రైల్వేజోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, మానవ వికాస వేదిక కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.మూర్తి, మానవతా స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు సారథ్యంలో కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు జాషువా, జి.వి.రావు, ఆర్.రాజేశ్వరరావు, రమామణి, ఎన్‌వీవీఎల్ఎన్ మూర్తి, కె.సత్యనారాయణమూర్తి, కె.సత్యనారాయణ, స్వార్థి, రాజేశ్వరి, సుందరమూర్తి, ఆదిల్ అహమ్మద్, ప్రదీప్, నవీన్ తదితరులు సేవలు అందించారు.

చినుకు పడితే చింతే



మొక్కలు పెరిగిపోవడంతో ..



మదీనాబాగ్‌లో పూడుకుపోయిన గెడ్డ

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనాబాగ్‌లో గెడ్డ పూడుకుపోయింది. వర్షం పడితే చాలు వరద పోటెత్తుతోంది. కాలనీ మొత్తం జలమయమవుతోంది. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో స్థానికులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. గెడ్డలో పూడికలు తీయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోతోందని స్థానికులు చెబుతున్నారు..

ఇళ్లలోకి నీరొస్తోంది..



గెడ్డ పూడుకుపోవడంతో పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వర్షం పడితే చాలు నీరంతా ఇళ్లలోకి వస్తోంది. ఆ సమయంలో విష పురుగులు కూడా వచ్చేస్తున్నాయి. అధికారులు స్పందించి గెడ్డలోని పూడికలు తొలగించాలి. గెడ్డకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తే సమస్య ఉండదు.

– బొండా అప్పారావు, మదీనాబాగ్

అరకొర షెల్టర్లు...అవస్థలు

వర్షానికి ముద్దయిన ప్రయాణికులు



వర్షంలో లగేజీలు, పిల్లలతో పరుగులు తీస్తున్న ప్రయాణికులు

అగనంపూడి: ఓపక్క జోరు వాన... మరోపక్క ఎక్కాల్సిన రైలు బండి ప్లాట్‌ఫారంపైకి వస్తుందనే ప్రకటన. అంతే లగేజీలు, వృద్ధులు, పిల్లలతో ప్రయాణికులు ఉరుకులు పరుగులతో తడిసి ముద్దయ్యారు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అరకొర షెల్టర్ల కారణంగా ప్రయాణికులు వర్షంలో తడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం తిరుమల ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయానికి ఉరుములు, మెరుపులతో వర్షం మొదలవ్వడంతో ప్రయాణికులు వారి బోగీలను వెతుక్కుంటూ లగేజీలు, పిల్లలతో పరుగులు తీయాల్సి వచ్చింది. మొదటి ప్లాట్‌ఫారం ప్రధాన భవనానికి రెండు వైపులా రైలు ఆగే వరకు షెల్టర్లు లేకపోవడంతో వంద మీటర్ల వరకు ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తుంది. మరో వైపు వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో షెల్టర్లు ఉన్న చోట ప్రయాణికులు వేచి ఉంటున్నారు. అమృత భారత్ కార్యక్రమంలో అయినా ప్లాట్‌ఫారం చివరి వరకు షెల్టర్లు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గోతులు

- మరమ్మతులు చేపట్టని అధికారులు
- చిన్న వర్షానికే చెరువులా మారిన వైనం



వుడాకాలనీ ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

గాజువాక: రోడ్డు మధ్యలో ఏర్పడిన ఓ గొయ్యి ఇప్పుడు చెరువును తలపిస్తోంది. ఆ గోతులో నుంచే రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆ గుంతను పూడ్చాలని ఎన్ని వినతులు అందుతున్నా అధికారులు మాత్రం స్పందించిన దాఖలాలు లేవు. పోర్టు వై జంక్షన్ నుంచి ఉక్కునగరం వెళ్లే ప్రధాన రహదారిలో దుర్గానగర్‌వద్ద రోడ్డుపై పరిస్థితి ఇది.

వై జంక్షన్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్లే దారిలో రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దుర్గానగర్, దిబ్బపాలెం, రామ్‌నగర్, మరోవైపు సర్దార్ నెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌తోపాటు అటు ఉక్కునగరం, స్టీల్‌ప్లాంట్, పరవాడ, అచ్యుతాపురం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. దీంతో పాటు స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే భారీ వాహనాలు కూడా ఇదే దారిని ఉపయోగిస్తాయి. భారీ వాహనాల కారణంగానే రోడ్డు మధ్యలో ఏడాది కిందట గొయ్యి ఏర్పడి ఇప్పుడు చెరువుగా మారిపోయింది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు మాత్రం పట్టుతప్పి పడిపోతున్నారు. ఈ గోతిని పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అటు వాహనచోదకులు, ఇటు స్థానికులు జీవీఎంసీ అధికారులకు విన్నవిస్తూనే ఉంటారు. కాగా, గతంలో స్టీల్ ప్లాంట్ అధికారులు ఈ రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. అప్పుడు కూడా ఈ గోతిని పట్టించుకోలేదు. ఆ రోడ్డు తమ పరిధిలోకి రాదంటూ జీవీఎంసీ అధికారులు స్పందించడం లేదు. ఆ రోడ్డు విషయం కోర్టులో ఉందని స్టీల్‌ప్లాంట్ వర్గాలు చెబుతున్నాయి. రోడ్డు మొత్తాన్ని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసినప్పుడు గొయ్యి మాత్రమే కోర్టు కేసులో ఉంటుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



చిన్నపాటి వర్షానికే చెరువుగా మారిన గొయ్యి

నిలిచిన వర్షపునీరు

పెదగంట్యాడ: బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు జన జీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి..రహదారులన్నీ చెరువులను తలపించాయి. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఆ తర్వాత చిన్నగా వర్షం ప్రారంభమైంది. సాయంత్రం వరకూ ఒకే రీతిన వాన పడడంతో మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో ప్రజలు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. మండలంలో వినాయకనగర్ ప్రధాన రహదారిలో మొత్తం వర్షపునీటితో నిండిపోయాయి. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేక అవస్థలు పడ్డారు.